సాక్షి
యాదాద్రి భువనగిరి
మంగళవారం । 11 । జూలై । 2023



ఏరోబిక్ సాగు ఎంతో మేలు
వర్షాభావ పరిస్థితుల్లో వరి సాగులో ఏరోబిక్ పద్ధతి అవలంబించాలంటున్నారు వ్యవసాయ శాఖ అధికారులు. - 8లో



రహదారి పనుల పరిశీలన
మోత్కూరు మండలం పాటిమట్ల వద్ద జాతీయ రహదారి పనులను ఎంపీ వెంకట్‌రెడ్డి పరిశీలించారు. - 10లో

గరిష్ఠం/కనిష్ఠం
35°/26°

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు ప్రపంచ జనాభా దినోత్సవం

భువనగిరి : ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో సోమవారం భువనగిరిలో ర్యాలీ నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్ర ఆస్పత్రి నుంచి అవగాహన ర్యాలీ ప్రారంభం కానుంది. 10.30కి కలెక్టరేట్‌లో ఏర్పాటు చేయనున్న కార్యక్రమంలో జిల్లాలో ఒక్కరే సంతానం కలిగిన 8 మంది, బిడ్డకు బిడ్డకు మధ్య ఏడాది ఎడబాటు పాటించిన 10 మందికి, అంతర్ ఇంజక్షన్ తీసుకున్న 9 మందికి ప్రోత్సాహకంగా రూ.1000 నగదు, ప్రశంసా పత్రాలు అందజేయనున్నారు. అదే విధంగా కుటుంబ నియంత్రణపై అవగాహన కల్పించిన వైద్యులు, స్టాఫ్‌నర్సులు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలకు ఇద్దరు చొప్పున మెమొంటోలతో పాటు ప్రశంసా పత్రాలు ఇవ్వనున్నారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు

భువనగిరి : ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాల కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ నారాయణరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10నుంచి ఆగస్టు 10వ తేదీ వరకు స్టడీ సెంటర్లలో సంప్రదించాలని సూచించారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగస్వాములను చేయాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

భువనగిరిటౌన్ : స్వచ్ఛ సర్వేక్షణ్ – 2023 ర్యాంకు సాధన కోసం చేపట్టే కార్యక్రమాల్లో ఎక్కువ మందిని భాగస్వాములను చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దీపక్ తివారీ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో మున్సిపల్ కమిషనర్లు, మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్‌తో సమావేశమై స్వచ్ఛ సర్వేక్షణ్ – 2023 సిటిజన్ ఫీడ్ బ్యాక్‌పై సమీక్షించారు. మున్సిపల్ సిబ్బంది, మెప్మా రిసోర్స్ పర్సన్లు మహిళా సంఘాల సభ్యుల సహకారంతో స్వచ్ఛ సర్వేక్షణ సిటిజన్ ఫీడ్ బ్యాక్‌లో ఎక్కువ సంఖ్యలో ప్రజలు పాల్గొనేలా కృషి చేయాలని కోరారు. హరితహారంలో మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో కమిషనర్లు నాగిరెడ్డి, చక్రపాణి, అధికారులు విశ్వేశ్వర్, మెప్మాపీడీ రమేష్‌బాబు పాల్గొన్నారు.

శివాలయంలో పూజలు



స్పటిక లింగానికి హారతినిస్తున్న పూజారి

యాదగిరిగుట్ట : యాదాద్రి క్షేత్రానికి అనుబంధంగా ఉన్న శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. శ్రీస్వామివారికి నిత్య కైంకర్యాలు చేపట్టి, మండపంలో నిత్య రుద్రహవనం, మహాశివుడికి అభిషేకం, అర్చనలు గావించారు. అనంతరం ముఖ మండపంలోని స్పటికలింగానికి పూజలు చేసి హారతినిచ్చారు. శివపార్వతుల కల్యాణంలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఇక యాదాద్రీశుడి ప్రధానాలయంలో స్వయంభూలకు, ప్రతిష్టా అలంకారమూర్తులకు సంప్రదాయ పూజలు కొనసాగాయి.

ఎమ్మెల్యేవి షో రాజకీయాలు



డబుల్ బెడ్ రూం ఇళ్లను పరిశీలిస్తున్న కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరిటౌన్ : డబుల్ బెడ్ రూం ఇళ్ల పంపిణీలో జాప్యం జరుగుతున్నా ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదని, కేవలం షో రాజకీయం చేస్తున్నారని డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. భువనగిరిలోని డబుల్ బెడ్ రూం ఇళ్లను సోమవారం ఆయన పరిశీలించారు. నెల రోజుల్లో ఇళ్లన్నీ పూర్తి చేయడంతో పాటు మౌలిక సౌకర్యాలు కల్పించి లబ్ధిదారులకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఇళ్ల మధ్య పేరుకుపోయిన చెత్తను తొలగించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కూర వెంకటేష్, మండల అధ్యక్షులు జంగయ్య, బ్లాక్ అధ్యక్షులు చిక్కుల వెంకటేష్, రాములు, కృష్ణ యాదవ్ కోళ్ల గంగాధర్ బిసుకుంట్ల సత్యనారాయణ కుక్కుదుగ్గు సోమయ్య పిట్టల బాలరాజ్ గుర్రాల శ్రీనివాస్ మైనార్టీ ఆబేద్ అలీ, నజీర్, కోట పెద్ద స్వామి, నర్సింహాచారి, ఎండీ తాహిర్, రఘుబాబు పాల్గొన్నారు.

• అంగన్‌వాడీల నిరసన గళం



ఐసీడీఎస్‌కు బడ్జెట్ పెంచాలని, సమస్యలు పరిష్కరించాలని కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ హెల్పర్లు, టీచర్లు

• కదంతొక్కిన గీత కార్మికులు



గీత కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న గీత కార్మికులు

బీఆర్‌ఎస్‌లో కలవరం!

ఎన్నికల వేళ కారు దిగుతున్న నేతలు

- ద్వితీయ శ్రేణి నాయకత్వంలో బయటపడుతున్న అసంతృప్తి
- పార్టీ ఆవిర్భావం నుంచి పనిచేస్తున్నా ప్రాధాన్యం దక్కడం లేదని ఆవేదన
- ఒక్కొక్కరుగా రాజీనామా
- తాజా పరిణామాలతో అధికార పార్టీలో టెన్షన్



సాక్షి, యాదాద్రి : సాధారణ ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ జిల్లా బీఆర్‌ఎస్ నేతల మధ్య అంతర్గత లుకలుకలు తీవ్రమవుతున్న పరిస్థితులు నెలకొన్నాయి. ప్రతి నియోజకవర్గంలోనూ అసమ్మతి రాగం ఊపందుకుంటోంది. ప్రధానంగా ద్వితీయ శ్రేణి నేతలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. తమకు పార్టీలో అన్యాయం జరుగుతుందని, సరైన ప్రాధాన్యం దక్కడం లేదంటూ ఉద్యమకాలం నుంచి పనిచేస్తున్న వారితో పాటు కొత్తగా పార్టీలో చేరిన వారు సైతం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొన్న మందుల సామేల్, నిన్న గుండాల సర్పంచ్ చిందం వరలక్ష్మి పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేయగా.. నేడు యాదగిరిగుట్ట మున్సిపల్ కౌన్సిలర్ కారు దిగారు. వీరి బాటలోనే మరికొందరు నడవనున్నట్లు తెలుస్తోంది. కాగా అధికార పార్టీలో నెలకొన్న పరిస్థితులను అనుకూలంగా మలుచుకునేందుకు కాంగ్రెస్ దృష్టి సారించింది.

గౌరవం దక్కడం లేదని..

ఉద్యమకాలం నుంచి పని చేస్తున్న తమకు సరైన గౌరవం దక్కడం లేదని పలువురు ప్రజా ప్రతినిధులు, పార్టీ ప్రతినిధులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఇటీవల బీఆర్‌ఎస్ నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనాల్లో సైతం అసంతృప్తి వెళ్లగక్కారు. కాంగ్రెస్ నుంచి గెలుపొంది సెప్టెంబర్‌లో బీఆర్‌ఎస్‌లో చేరిన యాదగిరిగుట్ట మున్సిపాలిటీ 5వ వార్డు కౌన్సిలర్ గుండ్లపల్లి వాణి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అధికార పార్టీలో అడుగడుగునా అవమానం ఎదురవుతుందని, ఆత్మహత్య చేసుకోవాలనిపిస్తుందని కన్నీరు పెట్టుకుంది. తనకు గుట్ట మున్సిపల్ చైర్‌పర్సన్ పదవి ఇవ్వాలని లోపాయికారి ఒప్పందం జరిగిందని, ఒప్పందం ప్రకారమే వాణి పార్టీ మారినట్లు అప్పట్లో ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలోనే జనవరి 30న ప్రస్తుత చైర్‌పర్సన్ ఎరుకల సుధాహేమేందర్‌గౌడ్‌పై బీఆర్‌ఎస్‌తో పాటు కాంగ్రెస్, సీపీఐ, ఇండిపెండెంట్ కౌన్సిలర్లు 11 మంది అవిశ్వాసం కోరుతూ కలెక్టర్‌ను కలిశారు. అనంతరం కౌన్సిలర్లతో కలసి క్యాంపునకు వెళ్లారు. అవిశ్వాసం నెగ్గేందుకు గుండ్లపల్లి వాణి భర్త గుండ్లపల్లి భరత్‌గౌడ్ తీవ్ర ప్రయత్నాలు చేశారు. కానీ, కలెక్టర్ అవిశ్వాసం కోసం ఓటింగ్ నిర్వహించలేదు. దీంతో నిరాశ చెందిన వాణి దంపతులు ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, టీపీసీసీ కార్యదర్శి బీర్ల అయిలయ్య సమక్షంలో తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరారు.

ఎన్నో అవమానాలు భరించానన్న గుండాల సర్పంచ్ వరలక్ష్మి

బీఆర్‌ఎస్ తరఫున గెలుపొందిన గుండాల సర్పంచ్ చిందం వరలక్ష్మి కూడా నాలుగు రోజుల క్రితం పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. తెలంగాణ ఉద్యమ కాలంనుంచి పార్టీ కోసం పనిచేస్తున్న తను ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నానని ఆవేదన వ్యక్తం చేశారు. తన కుమారుడు చనిపోతే పరామర్శించాల్సిన పార్టీ నాయకులు.. కొన్ని విషయాల్లో కేసులు పెట్టించే ప్రయత్నం చేశారని వాపోయారు. సొంత పార్టీ నాయకులే తనను ఇబ్బందులకు గురిచేస్తుంటే వారిని ఎమ్మెల్యే వారించలేదని చెప్పారు. అదే విధంగా గుండాల మండల కో ఆప్షన్ సభ్యుడు ఎండీ షర్ఫోద్దీన్ సైతం బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేసి జూన్ 24న ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన విషయం తెలిసిందే.

అసంతృప్తులపై కాంగ్రెస్ దృష్టి

రానున్న ఎన్నికల్లో అధికారమే లక్ష్యంగా ముందుకెళ్తున్న కాంగ్రెస్.. ఏ చిన్న అవకాశాన్ని వదులుకోవడానికి సిద్ధంగా లేదు. అందులో భాగంగా బీఆర్‌ఎస్‌లోని అసంతృప్తులపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

టికెట్ రాదన్న నిరాశతో సామేల్..

సూర్యాపేట జిల్లా తిర్మలగిరిలో జరిగిన తుంగతుర్తి నియోజకవర్గ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ మూడోసారి గాదరి కిషోర్‌ను ఎమ్మెల్యేగా గెలిపించాలని పార్టీ శ్రేణులను కోరారు. ఉద్యమకాలం నుంచి బీఆర్‌ఎస్‌లో పనిచేస్తున్న తనకు ఈసారైనా ఎమ్మెల్యే టికెట్ వస్తుందని సీనియర్ నేత మందుల సామేల్ ఆశ పెట్టుకున్నాడు. కానీ, మంత్రి కేటీఆర్ చేసిన ప్రకటనతో నిరాశ చెందిన సామేల్ బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.

ప్రత్యామ్నాయం వైపు మరికొందరి చూపు!

పార్టీ ఆవిర్భావం నుంచి పని చేస్తున్న వారిలో పలువురు ఎమ్మెల్యే టికెట్ ఆశిస్తూ వస్తున్నారు. కానీ, వారి ప్రయత్నాలు ఫలించే అవకాశం లేకపోవడంతో పార్టీకోసం ఎందుకు పనిచేయాలన్న భావనలో ఉన్నట్లు తెలుస్తోంది. అటువంటి నేతలంతా ప్రత్యామ్నాం వైపు దృష్టి సారించినట్లు ప్రచారం జరుగుతోంది.

చక్కదిద్దేందుకు రంగంలోకి ఎమ్మెల్యేలు

నాలుగైదు నెలల్లో సాధారణ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ద్వితీయ శ్రేణి నాయకత్వం పార్టీని వీడుతుండడం బీఆర్‌ఎస్ నాయకత్వాన్ని కలవరపెడుతోంది. పరిస్థితిని చక్కదిద్దేందుకు ఎమ్మెల్యేలు, జిల్లా నాయకులతో పాటు వారి అనుచరులు రంగంలోకి దిగారు. ఇదిలా ఉండగా మొదటి నుంచి పార్టీనే నమ్ముకున్న తమను కాదని, ఇతర పార్టీల నుంచి వచ్చిన వ్యక్తులను అందలం ఎక్కిస్తే పరిస్థితి ఇలాగే ఉంటుందని బీఆర్‌ఎస్‌లోని ఓ వర్గం సోషల్ మీడియా వేదికగా ఆరోపించడం గమనార్హం.

సొంతగూటికి గుండ్లపల్లి వాణి

- ఎంపీ కోమటిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక

భువనగిరి, యాదగిరిగుట్ట : యాదగిరిగుట్ట మున్సిపాలిటీ 5వ వార్డు కౌన్సిలర్ గుండ్లపల్లి వాణి భరత్‌గౌడ్ సొంతగూటికి చేరారు. సోమవారం భువనగిరి పట్టణ శివారులోని దీప్తి హోటల్‌లో ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బీర్ల అయిలయ్య సమక్షంలో ఆమె కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ పాలనలో రాష్ట్రం నాశనమైందన్నారు. ఉద్యోగులకు వేతనాలు ఇచ్చే పరిస్థితి కూడా లేదన్నారు. బంగారు తెలంగాణ సాధిస్తామని చెప్పి రూ.5లక్షల కోట్ల అప్పు చేశారని ఆరోపించారు. ఖమ్మంలో జరిగిన జనగర్జన సభను అడ్డుకునే ప్రయత్నం చేసినా ప్రజలు భారీగా తరలివచ్చారని పేర్కొన్నారు. కర్ణాటకలో మాదిరిగా తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని గెలిపించుకోవాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. యాదగిరిగుట్ట మున్సిపాలిటీలో కాంగ్రెస్‌కు 8 సీట్లు రాగా బీఆర్‌ఎస్‌కు 4 వచ్చాయన్నారు. వాణికి చైర్మన్ పదవి ఇస్తామని మాయమాటలు చెప్పి బీఆర్‌ఎస్‌లో చేర్చుకున్నారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో యాదగిరిగుట్టలో 12కు 12 సీట్లు గెలిపించే బాధ్యత నాదేనన్నారు.



కౌన్సిలర్ గుండ్లపల్లి వాణికి పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎంపీ వెంకట్‌రెడ్డి

తుది శ్వాస వరకు కాంగ్రెస్‌తోనే : వాణిభరత్‌గౌడ్

బీఆర్‌ఎస్‌లో ప్రాధాన్యం లేకపోవడంతో తిరిగి కాంగ్రెస్‌లో చేరామని కౌన్సిలర్ గుండ్లపల్లి వాణిభరత్‌గౌడ్ తెలిపారు. తుదిశ్వాస వరకు కాంగ్రెస్‌తోనే ఉంటామన్నారు. తమకు పదవుల కంటే విలువలతో కూడిన రాజకీయాలు ముఖ్యమన్నారు. రాబోయే ఎన్నికల్లో ఆలేరు నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగురవేసేందుకు కృషి చేస్తామన్నారు.కాంగ్రెస్‌లో చేరిన వారిలో వాణితో పాటు అరుణ గుణశేఖర్, ముక్కెర్ల మల్లేష్, సరోజన హరీష్ వారి అనుచరులు ఉన్నారు. కార్యక్రమంలో గుట్ట ఎంపీపీ చీర శ్రీశైలం మండల, పట్టణ అధ్యక్షులు కానుగు బాలరాజుగౌడ్, బందారపు భిక్షపతిగౌడ్, కౌన్సిలర్ ముక్కెర్ల మల్లేష్‌యాదవ్, నాయకులు బిట్టు హరీష్ పాల్గొన్నారు.

దేశానికి అన్నం పెట్టే స్థాయికి తెలంగాణ

- డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి

యాదగిరిగుట్ట : దేశానికి అన్నం పెట్టే స్థాయికి తెలంగాణ ఎదిగిందని డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి అన్నారు. యాదగిరిగుట్ట పీఏసీఎస్ ఆధ్వర్యంలో పలువురు రైతులకు సోమవారం దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాల చెక్కులు అందజేసి మాట్లాడారు. గతంలో పంజాబ్ ధాన్యం ఉత్పత్తిలో మొదటి స్థానంలో ఉండేదని, ఇప్పుడు తెలంగాణ ప్రథమ స్థానానికి ఎదిగిందన్నారు. సీఎం కేసీఆర్ రైతు పక్షపాతి అని.. ఉచిత కరెంట్, రైతుబీమా, రైతుబంధు వంటి పథకాలు అమలు చేస్తున్న ఘనత ఆయనకే దక్కుతుందన్నారు.యాదగిరిగుట్ట పీఏసీఎస్ టర్నోవర్ మూడేళ్ల క్రితం రూ.2.35లక్షలు ఉండగా ఇప్పుడు రూ.18 కోట్లకు పైగా చేరిందన్నారు. పీఏసీఎస్ నిధుల నుంచి గెదెలు, గొర్రెలకు దీర్ఘకాలిక అప్పులు, భూమి లేని వారికి రూ.50 వేల నుంచి రూ.70వేల వరకు అందజేశారన్నారు. వీటితో పాటు మరికొన్ని రుణాలు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఇమ్మడి రాంరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఎరుకల సుధా, సర్పంచ్‌లు కర్రె వెంకటయ్య, భైరగాని పుల్లయ్యగౌడ్, కొండం అరుణ అశోక్‌రెడ్డి, ఎంపీటీసీ కాల్నె అయిలయ్య, పీఏసీఎస్ డైరెక్టర్లు కోలం లింగం గౌడ్, మేకల రాజు, కంబాల మల్లేష్, ధీరావత్ రమేష్, రమాదేవి, ఒగ్గు లలితా, సీఈఓ ఆంజనేయులుతో పాటు 250మంది రైతులు పాల్గొన్నారు.



రైతులకు చెక్కులు అందజేస్తున్న మహేందర్‌రెడ్డి

ప్రజావాణిలో వినతుల వెల్లువ



ప్రజావాణికి తరలివచ్చిన బాధితులు, వినతులను పరిశీలిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

- అర్జీలను స్వీకరించిన కలెక్టర్, అదనపు కలెక్టర్
- సత్వరమే పరిష్కరించాలని అధికారులకు ఆదేశం

భువనగిరిటౌన్ : కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి బాధితులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా అధికారులు వినతులను స్వీకరించి పరిశీలించారు. అర్జీల పరిష్కారంలో అలసత్వం వహించకుండా సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. వివిధ సమస్యలపై 78 ఫిర్యాదు వచ్చినట్లు తెలిపారు. ఇందులో అత్యధికంగా రెవెన్యూకు సంబంధించి 52 అర్జీలు ఉన్నాయి.

వినతుల్లో కొన్ని..

- భువనగిరి మండలం బొల్లేపల్లిలో శ్రీరంగనాథస్వామి ఆలయానికి చెందిన 8.13 ఎకరాల భూమి శివాలయం పేరున వచ్చిందని, ఆ భూమిని రంగనాథస్వామి ఆలయం పేరున మార్చాలని కోరుతూ రంగనాథస్వామి ఆలయ అర్చకులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.
- భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని 3, 4 వార్డుల్లో కోతుల బెడదను అరికట్టాలని ఆయా వార్డులకు చెందిన యువకులు కలెక్టర్‌కు విన్నవించారు.
- అర్హులందరికీ దళితబంధు పథకం వర్తింపజేయాలని కోరుతూ దళిత హక్కుల పోరాట జిల్లా సమితి ఆధ్వర్యంలో అదనపు వినతిపత్రం అందజేశారు. రాజకీయ జోక్యం లేకుండా కలెక్టర్ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయాలని, ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించాలని కోరారు. అలాగే దరఖాస్తు చేసుకున్న దివ్యాంగులందరికీ గృహలక్ష్మి పథకం వర్తింపజేయాలని, పెండింగ్‌లో ఉన్న ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు నిధులు మంజూరు చేయాలని, అసైన్డ్ ల్యాండ్ కమిటీని పునరుద్ధరించి భూమి పంపిణీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు కాశపాక దయాకర్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రోళ్ల లింగస్వామి జిల్లా కార్యవర్గ సభ్యులు అన్నంపట్ల యాదగిరి, కోట శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలేరు మండలం గొలనుకొండలో 50 నిరుపేద దివ్యాంగుల కుటుంబాలు ఉన్నాయని, వారికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలంటూ వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు కొడిదల నరేష్ వినతిపత్రం అందజేశారు. సర్వే నంబర్ 43,27లో 10 ఎకరాల 30 గుంటల భూమి ఉందని, దాన్ని దివ్యాంగ కుటుంబాలకు పంపిణీ చేయాలని కోరారు.

ఎంఈఓ పోస్టులన్నీ ఖాళీ!

17 మండలాలకు ముగ్గురు ఇన్‌చార్జ్‌లు

- ఒక్కొక్కరికి ఐదారు మండలాల బాధ్యతలు
- పనిభారం, ఒత్తిడితో సతమతం
- పాఠశాలలపై కొరవడిన పర్యవేక్షణ



రామన్నపేట : ఎంతో ప్రాధాన్యం ఉన్న విద్యాశాఖను ముందుకు నడిపే అధికారుల్లేక కునారిల్లుతోంది. జిల్లాలోని 17 మండలాలకు ఒక్కరంటే ఒక్క ఎంఈఓ (మండల విద్యాధికారి) కూడా లేదు. ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులకు బాధ్యతలు అప్పగించారు. అది కూడా ఆరు మండలాలకు ఒకరిని చొప్పున నియమించడంతో వారిపై అదనపు భారం పడుతోంది. వెరసి పాఠశాలలపై పర్యవేక్షణ కొరవడి ఫలితాలపై ప్రభావం చూపుతోంది.

పాఠశాలలు, విద్యార్థులు ఇలా..

జిల్లాలో 17 మండలాలు, ఆరు మున్సిపాలిటీలు ఉన్నాయి. వాటి పరిధిలో 488 ప్రాథమిక, 70 ప్రాథమికోన్నత, 171 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 56 వేల మందికి పైగా విద్యార్థులు ఉన్నారు. ఇవి కాకుండా 250 వరకు ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. వాటిలో సుమారు 40వేల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. కాగా 17 మండలాలకు ఎంఈఓ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మండల విద్యాధికారి లేనిచోట సీనియర్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడికి బాధ్యతలు అప్పగించారు. కోర్టు కేసులు, బదిలీ ప్రక్రియ నిలిచిపోవడం తదితర కారణాల వల్ల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులను ఎంఈఓ బాధ్యతల నుంచి తప్పించారు. ఇప్పుడు కేవలం ముగ్గురు గెజిటెడ్ హెచ్‌ఎంలు మాత్రమే ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తున్నారు. ఒక్కో హెచ్‌ఎం ఐదారు మండలాల బాధ్యతలు నిర్వర్తించాల్సిన దుస్థితి నెలకొంది.

ఇన్‌చార్జ్‌లపై పనిభారం

17 మండలాల బాధ్యతలు ముగ్గురే చూస్తుండడంతో వారిపై విపరీతమైన పనిభారం పెరిగింది. పిల్లల నమోదు, ఎఫ్‌ఏ, ఎస్‌ఏ పరీక్షల మార్కులను ఆన్‌లైన్ చేయడం, పుస్తకాలు, నోటు బుక్స్, యూనిఫామ్ పంపిణీ, నెలనెలా ఇండెంట్ పంపడం, మన ఊరు – మన బడి పనుల పర్యవేక్షణ, విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్, బిల్లుల తయారీ, ఐసీటీ, డిజిటల్, మధ్యాహ్న భోజనం, స్మార్ట్ తరగతుల పర్యవేక్షణ వంటి బాధ్యతలు నిర్వహించవలసి ఉంటుంది. ఇవే గాక డీఈఓలు, కమిషనర్ కార్యాలయం ఆదేశాలను పాటించవలసి ఉంటుంది. ఒక కార్యక్రమం ముగిసేలోపు మరో ప్రోగ్రాం సిద్ధంగా ఉంటుంది.

మండలానికి రెండు, మూడు క్లస్టర్లు

పాఠశాలల సంఖ్యకు అనుగుణంగా మండలానికి రెండు, మూడు క్లస్టర్ (కాంప్లెక్స్)లను ఏర్పాటు చేశారు. ఒక్కో కాంప్లెక్స్ పరిధిలో 10నుంచి 15 పాఠశాలలు ఉన్నాయి. కాంప్లెక్స్ పరిధిలో సమావేశాల నిర్వహణ, ఉపాధ్యాయుల వేతనాల బిల్లులను తయారు చేయడం వంటి పనులను కాంప్లెక్స్ హెడ్మాస్టర్లకు అప్పగించారు. పాఠశాలల విద్యాబోధన, నిర్వహణ, పర్యవేక్షణకు మండలానికి ఒక సీనియర్ గెజిటెడ్ హెడ్మాస్టర్‌ను మండల నోడల్ అధికారిగా నియమించారు. నోడల్ అధికారి తాను పని చేస్తున్న పాఠశాలతోపాటు, మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను పర్యవేక్షించవలసి ఉంటుంది.

ఇన్‌చార్జ్‌లకు కేటాయించిన మండలాలు ఇవీ..

జి.క్రిష్ణ : ఆలేరు, మోటకొండూరు, బొమ్మలరామారం, రాజాపేట, తుర్కపల్లి, యాదగిరిగుట్ట
పి.నాగవర్ధన్‌రెడ్డి : భువనగిరి, బీబీనగర్, చౌటుప్పల్, సంస్థాన్‌నారాయణపురం, భూదాన్‌పోచంపల్లి
వి.శ్రీధర్ : ఆత్మకూరు(ఎం), మోత్కూరు, అడ్డగూడూరు, గుండాల, రామన్నపేట, వలిగొండ మండలాలను కేటాయించారు.

ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి



విద్యాశాఖలో ఉపాధ్యాయులతో పాటు ఎంఈఓ పోస్టులు చాలా వరకు ఖాళీగా ఉన్నాయి. దీంతో విద్యార్థులకు సరైన బోధన జరగడం లేదు. ఎంఈఓలు లేకపోవడంతో పాఠశాలలపై పర్యవేక్షణ కొరవడింది. పోటీ ప్రపంచంలో విద్యార్థులు రాణించాలంటే ప్రాథమిక స్థాయిలో పునాది బలంగా ఉండాలి.

–బొడ్డుపల్లి వెంకటేశం, విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకుడు

నోడల్ అధికారులతో పర్యవేక్షణ



ముగ్గురు ఇన్‌చార్జి ఎంఈఓలు విధులు నిర్వర్తిస్తున్నారు. కేవలం పిల్లల్లో విద్యా సామర్థ్యాలు పెంచడం, పాఠశాలల పర్యవేక్షణ కోసం మండలానికి ఒక నోడల్ అధికారిని నియమించాం. వారు పాఠశాలలను సందర్శించి రోజువారి నివేదికలను పంపిస్తుంటారు. ప్రమోషన్లు, బదిలీలు అనేవి ప్రభుత్వ పరిధిలోని అంశాలు.

–కె.నారాయణరెడ్డి, డీఈఓ

క్లుప్తంగా

యువకుడి అదృశ్యం.. కేసు నమోదు


ప్రసాద్ (ఫైల్)

హుజూర్‌నగర్: పట్టణానికి చెందిన యువకుడు అదృశ్యమైనట్లు సోమవారం ఫిర్యాదు అందడంతో హుజూర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఏఎస్‌ఐ లింగారెడ్డి తెలి పిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్‌లోని సుందరయ్య కాలనీకి చెందిన సుంకరి కనకమ్మ పెద్ద కుమారుడు ప్రసాద్ ఈ నెల 7వ తేదీన బట్టలు ఇస్త్రీ చేయించుకుని వస్తానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో సోమవారం అతడి తల్లి కనకమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

ఆలయంలో చోరీకి యత్నం


ఆలయ తలుపులు పగులగొట్టిన దొంగలు

భువనగిరి: మండలంలోని రాయగిరి గ్రామ చెరువు కట్టపై గల కట్ట మైసమ్మ దేవాలయంలో ఆదివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి యత్నించారు. రోజుమాదిరిగా సోమవారం ఉదయం ఆలయ పూజారులు దేవాలయం వద్దకు వెళ్లగా.. తాళం పగులగొట్టి తలుపులు తెరిచి ఉండటం గమనించి మిగతా పూజారులకు సమాచారం అందించారు. వారు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని ఆలయాన్ని, హుండీని పరిశీలించారు. ప్రతిరోజు హుండీలో భక్తులు వేసే కానుకలను తీసి భద్రపర్చడంతో దొంగలు ఏమీ ఎత్తుకెళ్లలేదని పూజారులు పేర్కొన్నారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

భువనగిరి: భువనగిరి పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలో సోమవారం రాత్రి 8గంటల సమయంలో కాజీపేట–సికింద్రాబాద్ రైలు మార్గంలో గుర్తుతెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం తెలుసుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భువనగిరి పట్టణంలోని జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. మృతుడు సుమారు 35 నుంచి 40 సంవత్సరాల వయస్సు ఉంటాడని, తెలుపు రంగు చొక్కా, లైట్ ఆకుపచ్చ రంగు ప్యాంట్ ధరించినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మెడలో లైట్ ఆరెంజ్ రంగు టవల్ ఉందని పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు కేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే జీఆర్‌పీ ఇన్‌చార్జి సత్యనారాయణ తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 8712658619, 8712568454 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ప్రభుత్వ స్థలంలో వెలిసిన గుడిసెలు

- గతంలో నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ఆ భూమి కేటాయింపు
- అనివార్య కారణాలతో పంపిణీ కాని పట్టాలు


ఖాళీ స్థలంలో ఏర్పాటు చేసుకున్న గుడిసెలు

డిండి: అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాల పట్టాలివ్వాలని డిండి మండల పరిధిలోని ఎర్రగుంటపల్లి గ్రామ సర్పంచ్ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయడంతో దాదాపు 23 సంవత్సరాలు నుంచి ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలంలో ఉన్నట్టుండి సోమవారం గుడిసెలు వెలిశాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. జడ్చర్ల–కోదాడ హైవేకు ఆనుకొని ఉన్న ఎర్రగుంటపల్లి స్టేజీ వద్ద 1999 సంవత్సరం జూన్ 13వ తేదీన గ్రామానికి చెందిన 55 మంది నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు అప్పటి ప్రభుత్వం సర్వే నంబర్లు 102, 105లో 2.30 ఎకరాల వ్యవసాయ భూమని అదే గ్రామానికి చెందిన ఓ రైతు వద్ద కొనుగోలు చేసింది. ఆ తర్వాత అర్హులైన వారి జాబితాను అధికారులు తయారుచేసినప్పటికీ ఇళ్ల స్థలాల పట్టాలు మాత్రం పంపిణీ చేయలేదు. అప్పటి నుంచి దాదాపు 23 సంవత్సరాల పాటు ఖాళీగా ఉన్న అట్టి ప్రభుత్వ స్థలంలో గతేడాది నుంచి అంగన్‌వాడీ కేంద్రం, తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణంతో పాటు పలు ప్రభుత్వ భవనాలు నిర్మించాలని కొంతమంది అధికారులు ప్రయత్నాలు చేశారు. కానీ నిరుపేదలకు కేటాయించిన స్థలంలో ప్రభుత్వ భవనాలు నిర్మిస్తే ఊరుకునేది లేదని పలువురు లబ్ధిదారులు పేర్కొనడంతో భవనాల ఏర్పాటుకు అనుమతుల ప్రక్రియ ఆగిపోయినట్లు సమాచారం. ప్రస్తుతం అదే స్థలంలో 40 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఈ నెల 6వ తేదీన గ్రామ సర్పంచ్ పేట రాధ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. దీంతో పాత జాబితాలోని 55 మందిని కాకుండా 40 మందికి మాత్రమే ఇళ్ల స్థలాలకు పట్టాలు ఇవ్వాలని జిల్లా ఉన్నతాధికారులకు నూతన జాబితాను పంపిచారన్న అనుమానంతో పాత జాబితాలోని పలువురు లబ్ధిదారులు ఖాళీ ప్రదేశంలోని పిచ్చి మొక్కలను తొలగించి గుడిసెలు ఏర్పాటు చేసుకున్నారు. పాత జాబితానుసరించి 55 మందికి ఇళ్ల స్థలాల పట్టాలు ఇవ్వాలని లబ్ధిదారులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంపై స్థానిక తహసీల్దార్ చంద్రశేఖర్‌ను వివరణ కోరగా.. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అర్హులందరికీ ఇళ్ల స్థలాల పట్టాలు అందుతాయని పేర్కొన్నారు. ఆర్‌ఐ శ్యాంనాయక్ సమక్షంలో అట్టి స్థలంలో ఏర్పాటు చేసిన గుడిసెలను వీఆర్‌ఏ తొలగించినట్లు తహసీల్దార్ తెలిపారు.

బీసీల్లో రాజకీయ చైతన్యం రావాలి

- టీపీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్, మాజీ ఎంపీ వీహెచ్
- సూర్యాపేటలో బీసీల ఐక్యవేదిక సమావేశానికి హాజరు


సమావేశంలో మాట్లాడుతున్న మధుయాష్కీ, చిత్రంలో వీహెచ్, చెరుకు సుధాకర్ తదితరులు

భానుపురి (సూర్యాపేట): బీసీల్లో రాజకీయ చైతన్యం రావాలని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్, పీసీసీ మాజీ అధ్యక్షుడు, మాజీ ఎంపీ వి.హనుమంతరావు (వీహెచ్) అన్నారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జే ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బీసీల ఐక్యవేదిక సమావేశానికి వారు ముఖ్యఅతిథుగా హాజరై మాట్లాడారు. ప్రజల బాధలు తెలుసుకోవడానికే రాహుల్‌గాంధీ కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు పాదయాత్ర చేశారన్నారు. తెలంగాణలో జనాభా దామాషా ప్రకారం బీసీలకు సీట్లు కేటాయించడానికి కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందన్నారు. రాష్ట్రంలో 54 శాతం బీసీలుంటే వారిని సర్పంచ్, ఉపసర్పంచ్, ఎంపీటీసీ స్థానాలకే పరిమితం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశానికి స్వాతంత్య్రం తెచ్చిన మహాత్మాగాంధీని చంపిన గాడ్సేను బీజేపీ దేవుడంటోందని, ప్రజలు రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్తారని అన్నారు. తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీకి కృతజ్ఞతగా రాష్ట్రంలో ప్రజలంతా మద్దతుగా నిలిచి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తేవాలన్నారు. టీఆర్‌ఎస్.. బీఆర్‌ఎస్‌గా మారినప్పుడే కేసీఆర్ పని అయిపోయిందని చెప్పారు. డబుల్‌బెడ్ రూం ఇళ్లకోసం అధికార పార్టీ నాయకులు రూ.2లక్షలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. కేంద్రానికి ఎవరైతే వ్యతిరేకంగా ఉంటారో.. మాట్లాడుతారో వాళ్లపై సీబీఐ ఎంక్వయిరీలు ఉంటున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు కోరుకుంటున్నారని, బీసీలందరూ కలిసికట్టుగా పనిచేసి కాంగ్రెస్ పార్టీ గెలుపునకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ఉపాధ్యక్షులు చెరుకు సుధాకర్, లక్ష్మణ్ యాదవ్, ప్రధాన కార్యదర్శులు బీర్ల అయిలయ్య, పున్న కైలాష్ నేత, రాపోలు జయప్రకాశ్, పీసీసీ సభ్యుడు కృష్ణయ్య, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అనురాధ కిషన్‌రావు, నల్లగొండ జిల్లా సీనియర్ నాయకులు సిరాజ్ ఖాన్, తిప్పర్తి మాజీ జెడ్పీటీసీ తండు సైదులుగౌడ్, భువనగిరి నియోజకవర్గ సీనియర్ నాయకులు తంగెళ్లపల్లి రవికుమార్, సీనియర్ ఓబీసీ నాయకులు, జెడ్పీటీసీలు ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా నృసింహుడి నిత్యకల్యాణం

మఠంపల్లి: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మట్టపల్లి క్షేత్రంలో సోమవారం శ్రీలక్ష్మీనృసింహస్వామి నిత్య కల్యాణాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యాగ్నిహోత్రి, మూలవిరాట్‌కు పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. శ్రీలక్ష్మీనరసింహస్వామి, రాజ్యలక్ష్మీచెంచులక్ష్మీ అమ్మవార్లకు అష్టోత్తర, సహస్ర, కుంకుమార్చనలు గావించారు. అనంతరం స్వామి అమ్మవార్లను నూతన పట్టువస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోలు మహోత్సవం నిర్వహించారు. ఆ తర్వాత మాంగళ్యధారణ, తలంబ్రాలతో నిత్యకల్యాణం జరిపించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అదే విధంగా క్షేత్రంలోని శివాలయంలో శ్రీపార్వతీరామలింగేశ్వరస్వమికి ఏకాదశ మహారుద్రాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక చైర్మన్ చెన్నూరు విజయ్‌కుమార్, ఈఓ నవీన్, అర్చకులు కృష్ణమాచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, భక్తులు ఉన్నారు.

ఐసీడీఎస్‌కు బడ్జెట్ పెంచండి

భువనగిరిటౌన్: ఐసీడీఎస్‌కు బడ్జెట్ పెంచడంతో పాటు అంగన్‌వాడీ ఉద్యోగులు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బూరుగు సప్న, సీహెచ్ రామ కుమారి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నాయన్నారు. నూతన జాతీయ విద్యా విధానం రద్దు చేయాలని, పెన్షన్, ఈఎస్‌ఐ ఉద్యోగ భద్రత కల్పించాల, మెనూ చార్జీలు పెంచాలని, హెల్త్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ హెల్పర్స్ అండ్ టీచర్స్ యూనియన్ నాయకులు పద్మ, అనురాధ, లక్ష్మి, సునీత, మంజుల, ఉమా, భాగ్యలక్ష్మి, పద్మ, జంగమ్మ, శ్యామల, రుక్మిణి, నాగమణి, భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

భారీ చెట్లు నరికివేత


ఏవీకేతండాలో చెట్ల దుంగలను ట్రాక్టర్‌లో తరలిస్తున్న కూలీలు

ఆత్మకూర్ (ఎస్) : పాఠశాలల అభివృద్ధి, హరిత హారం పేరుతో పచ్చదనాన్ని పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తుండగా.. క్షేత్రస్థాయిలో మాత్రం అధికారులు, ప్రజాప్రతినిధులు అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. పచ్చదనం కోసం చెట్లను పెంచకపోగా ఏళ్ల నాటినుంచి నీడనిస్తున్న పెద్ద పెద్ద వృక్షాలను నరికి సొమ్ము చేసుకుంటున్నారు. మండల పరిధిలోని ఏవీకే తండా పాఠశాలలో ఏళ్ల క్రితం నాటిన వేపచెట్లతో పాటు ఇతర నీడనిచ్చే చెట్లు భారీగా పెరిగాయి. ఈ చెట్ల కారణంగా పాఠశాల ఆవరణ చల్లగా ఉండడంతో పాటు ఆహ్లాద వాతావరణం ఏర్పడుతుంది. ఉపాధ్యాయులు కొన్ని సమయాల్లో పిల్లలకు ఈ చెట్ల కిందనే పాఠాలు బోధించేవారు. అయితే అదనపు తరగతి గది, ప్రహరీ మంజూరు కాగా ఇదే అదునుగా స్థానిక సర్పంచ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఎస్‌ఎంసీ చైర్మన్‌లు కలిసి ఈ చెట్లను ఓ వ్యాపారికి గుట్టుచప్పుడు కాకుండా అమ్ముకున్నట్లు తండావాసులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై ఎంఈఓ ధారాసింగ్‌ను వివరణ కోరగా పాఠశాలకు ప్రహరీ, అదనపు గది మంజూరైందన్నారు. వీటికోసం చెట్లను తొలగించినా ఎవరికి విక్రయించరాదని, కారకులపై చర్యలు తీసుకుంటామన్నారు.

ఆర్టీసీ ఎండీ ఆదేశాలతోనే ప్రహరీ నిర్మాణం


ఆర్టీసీ అధికారులతో వాదనకు దిగిన కాంగ్రెస్ నాయకులు, దుకాణాదారులు

చౌటుప్పల్: ఆర్టీసీ స్థలాల పరిరక్షణలో భాగంగా ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు అన్ని ప్రాంతాల్లో బస్టాండ్‌లకు ప్రహరీలు నిర్మిస్తున్నామని ఆర్టీసీ ఇంజనీరింగ్ విభాగం జిల్లా ఈఈ ఎంవీ సత్యనారాయణ తెలిపారు. చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని ఆర్టీసీ బస్ స్టేషన్‌ను అధికారులతో కలిసి సోమవారం ఆయన సందర్శించారు. బస్టాండ్ చుట్టూ ప్రహరీ నిర్మాణం చేపట్టే ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాము ప్రతిపాదించిన ప్రహరీ ఆర్టీసీ స్థలంలోనే ఉందన్నారు. కాంప్లెక్స్‌ల వైపు తమ సంస్థ స్థలంలో భూమి లెవల్‌లోనే బేస్‌మెంట్ నిర్మిస్తామని తెలిపారు. రాజకీయాలతో తమకు సంబంధం లేదన్నారు. రాజకీయ పార్టీలు, ప్రజలు సహకరించాలని కోరారు. ఆయన వెంట నార్కట్‌పల్లి డిపో మేనేజర్ వెంకటమ్మ, స్థానిక రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సుధాకర్, ఆర్టీసీ అధికారులు ఉన్నారు.

రాజకీయ కక్షసాధింపులో భాగంగానే..

ఆర్టీసీ అధికారులు వచ్చిన విషయం తెలుసుకున్న రాజీవ్ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి ఎండీ ఖయ్యూం, ఐఎన్‌టీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బోయ రామచంద్రం ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, స్థానిక కాంప్లెక్స్‌లకు చెందిన దుకాణాదారులు అక్కడికి వెళ్లారు. ప్రహరీ నిర్మాణ ప్రతిపాదనను విరమించుకోవాలన్నారు. ఇన్ని సంవత్సరాలుగా లేని ప్రహరీ నిర్మాణం అంశం కొత్తగా రావడానికి రాజకీయ కక్ష సాధింపులో భాగమేనని ధ్వజమెత్తారు. ప్రజల విన్నపాన్ని విస్మరించి ప్రహరీ నిర్మాణం చేయాలని చూస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయన్నారు. రెండ్రోజులు గడువు కావాలని కోరగా అధికారులు సమ్మతించారు.

గంజాయి తరలిస్తూ పట్టుబడిన యువకులు

- అరెస్ట్ చేసిన పోలీసులు


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ అధికారులు

కొత్తగూడెం అర్బన్: సినీఫక్కీలో తప్పించుకుపోతున్న గంజాయి రవాణాదారులను సోమవారం భద్రాద్రి కొత్తగూడెం పోలీస్, ఎక్సైజ్ శాఖల అధికారులు అరెస్ట్ చేశారు. కొత్తగూడెం ఎక్సైజ్ సీఐ ఎల్.జయశ్రీ కథనం ప్రకారం.. గంజాయి రవాణా చేస్తున్నారనే సమాచారంతో ఇల్లెందు క్రాస్ రోడ్డులో సోమవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో నల్లగొండ జిల్లా మిర్యాలగూడేనికి చెందిన రాంరాకేష్, జి.వసంత్, రంగారెడ్డి జిల్లా బాల్‌రెడ్డినగర్‌కు చెందిన లావుడ్యా సాయి కారులో ఏపీలోని చింతూరు నుంచి 13.5 కేజీల ఎండు గంజాయి తీసుకెళ్తున్నారు. అయితే, గంజాయి కనిపించకుండా కారు డోర్‌లో ఫిక్స్ చేయగా... పోలీసులను గమనించి అతివేగంతో కొత్తగూడెం మీదుగా వెళ్తున్నారు. ఈ క్రమంలో సుజాతనగర్ పోలీసులు రహదారిపై వాహనాన్ని అడ్డుగా పెడితే ఆ వాహనంతో పాటు మరో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టగా కారు నిలిచిపోయింది. ఈమేరకు పోలీసులు రూ.2.7లక్షల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకుని ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. కాగా, నిందితుల్లో ఒకరు బీటెక్, మరొకరు డిగ్రీ చదువుతుండగా, ఇంకొకరు షాపు నడుపుతున్నారు. వీరు వ్యసనాలకు అలవాటుపడి గంజాయి తీసుకెళ్తున్నట్లు పోలీసులు గుర్తించారు.

కుటుంబ కలహాలతో దంపతుల ఆత్మహత్యాయత్నం


చికిత్స పొందుతున్న షహీనా

హుజూర్‌నగర్‌రూరల్: కుటుంబ కలహాలతో దంపతుల ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన హుజూర్‌నగర్ మండలంలోని గోపాలపురం గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గోపాలపురం గ్రామానికి చెందిన షేక్ యూసుఫ్ లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతనికి షేక్ షహీనాతో 16 సంవత్సరాల క్రితం వివాహమైంది. వీరికి 6వ, 9వ తరగతి చదువుతున్న ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్యాభర్తల మధ్య గొడవల కారణంగా చాలాకాలం ఇద్దరు వేర్వేరుగా ఉండగా.. ఇటీవలే మళ్లీ ఇరువురు కలిసి ఉంటున్నారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం ఇద్దరికీ గొడవ కావడంతో యూసుఫ్ పురుగుల మందు తాగాడు. అది గమనించిన షహీనా ఇంట్లోని విద్యుత్ వైర్ పట్టుకోవడంతో విద్యుదాఘాతానికి గురై స్పృహ కోల్పోయింది. కుటుంబ సభ్యులు గమనించి వారిద్దరిని హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో సూర్యాపేట జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

పత్తి చేనులో గుంటుక తోలుతూ రైతు మృతి


భిక్షం (ఫైల్)

శాలిగౌరారం: పత్తి చేనులో గుంటుక తోలుతున్న ఓ రైతు గుండెపోటుతో చేనులోనే ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన శాలిగౌరారం మండలంలోని పెర్కకొండారం గ్రామంలో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. పెర్కకొండారం గ్రామానికి చెందిన సెగ్గెం భిక్షం(49)కు ఐదెకరాల వ్యవసాయ భూమి ఉంది. మరో ఐదెకరాల భూమిని కౌలుకు తీసుకొని మొత్తం 10 ఎకరాలలో పత్తి సాగుచేశాడు. సోమవారం తన పొలంలోని పత్తి చేనులో 10మంది మహిళా కూలీలు కలుపు తీస్తుండగా.. మరోపక్క భిక్షం గుంటుక తోలుతున్నాడు. సాయంత్రం 4.30గంటల సమయంలో గుండెపోటుతో భిక్షం పొలంలోనే కుప్పకూలిపోయాడు. మహిళా కూలీలు గమనించి భిక్షంను సమీపంలోని చెట్టు కిందకు తరలించారు. అనంతరం 108 వాహనంలో నకిరేకల్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడికి భార్య, అవివాహితులైన కుమారుడు, కుమార్తె ఉన్నారు.

గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


గీత కార్మికుల దీక్షకు సంఘీభావం తెలుపుతున్న డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరిటౌన్ : ప్రభుత్వం గీత కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి డిమాండ్ చేస్తూ గీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ఒక రోజు దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ.. మునుగోడు ఉప ఎన్నిక సందర్భంగా ఏర్పాటు చేసిన గౌడ ఆత్మీయ సమ్మేళనంలో గౌడ కులస్తులకు మంత్రి కేటీఆర్ ఇచ్చిన హామీలు ఇంతవరకు అమలు చేయలేదన్నారు. ప్రతి గీత కార్మికుడికి లక్ష రూపాయల ఆర్థిక సాయం వర్తింపజేయాలని, సేఫ్టీ మోకులు ఉచితంగా అందజేయాలని, మోటార్ సైకిల్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీక్షకు డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి సంఘీభావం తెలిపి మాట్లాడారు. తాటిచెట్టుపైనుంచి పడి మృతి చెందినా, ప్రమాదానికి గురైనా రూ.10లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, మెడికల్ బోర్డు నిబంధనలు తొలగించాలని, సొసైటీలకు ఐదెకరాల భూమి కేటాయించాలని కోరారు. అలాగే కల్లుకు మార్కెట్, నీరా, తాటి, ఈత ఉత్పత్తుల పరిశ్రమలకు రూ.5వేల కోట్లు బడ్జెట్‌లో కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గీత కార్మిక సంఘం నాయకులు కోల వెంకటేష్. పాండవుల లక్ష్మణ్. బత్తిని సత్యనారాయణ, పాండల మైసయ్య, మట్ట బాలరాజు, శ్రీదర్, పబ్బతి మల్లేష్, రేకల లక్ష్మి నారాయణ, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

చేపల పెంపకంపై యువత, రైతులు ఆసక్తి


సమావేశంలో మాట్లాడుతున్న కేవీకే సీనియర్ శాస్త్రవేత్త లవకుమార్

పెన్‌పహాడ్: ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా నీటి వనరులు పుష్కలంగా లభించడంతో యువత, రైతులు చేపల పెంపకంపై ఆసక్తి చూపుతున్నారని గరిడేపల్లి మండంలోని గడ్డిపల్లిలో గల కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త బి. లవకుమార్ అన్నారు. సోమవారం పెన్‌పహాడ్ మండల పరిధిలోని జల్మాలకుంట గ్రామంలో కేవీకే ఆధ్వర్యంలో జాతీయ మత్స్య రైతుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గత కొన్ని సంవత్సరాల నుంచి రాష్ట్రంలో చేపల ఉత్పత్తి గణనీయంగా పెరిగిందని అన్నారు. ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన కింద రూ.6వేల కోట్లు బడ్జెట్ కేటాయించబడిందని, మత్స్య పరిశ్రమ ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చే వారికి సబ్సిడీ కల్పించి ప్రోత్సహిస్తుందని అన్నారు. దేశ ఆహార భద్రతకు దోహదపడే విధంగా ఆధునిక ఆక్వాకల్చర్ పద్ధతులను అవలబించడం, చేపల ఉత్పాదకతను కాపాడుకోవడంలో మత్స్య రైతులు ఎంతగానో కృషి చేస్తున్నారని న్నారు. కేవీకే ద్వారా యువతకు, రైతులకు జాతీయ మత్స్య అభివృద్ధి మండలి, హైదరాబాద్ సహకారంతో జిల్లా వ్యాప్తంగా 300పైగా రైతులకు మత్స్య పరిశ్రమపై స్వల్ప, దీర్ఘకాలిక శిక్షణ ఇచ్చామని పేర్కొన్నారు. చేపల చెరువులు నిర్మించదలచిన రైతులకు తగు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించి తోడ్పాటు అందిస్తున్నామని అన్నారు. తద్వారా నిరుద్యోగ యువత స్వయం ఉపాధి అవకాశాలు పొందుతున్నారని వివరించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు డి. నరేష్, కిరణ్, నరేష్, రైతులు డి. నాగేందర్, దేవుల, నవీన్, రమణ, లక్ష్మణ్, శంకర్, బోడు, జెత్‌రామ్లు తదితరులు పాల్గొన్నారు.

ఏరోబిక్ సాగు ఎంతో మేలు

పాడి పంట


ఏరోబిక్ పద్ధతిలో నేరుగా పొడి దుక్కిలో వరి విత్తనాలు విత్తుతున్న రైతు


ఏపుగా పెరిగిన వరి పంట

నడిగూడెం: వర్షాభావ పరిస్థితులు, నీటి వనరులు తగ్గిపోతున్న నేపథ్యంలో వరి సాగు చేసే రైతులు ఏరోబిక్ పద్ధతిని అనుసరించాలని నడిగూడెం మండల వ్యవసాయాధికారి ఎం. రాజగోపాలరావు సూచిస్తున్నారు. ఏరో బిక్ పద్ధతిలో మొదట వరి విత్తనాలను పొడి దుక్కుల్లో విత్తుకొని ఆ తర్వాత కాల్వలు, బావులు, బోర్లలో భూ గర్భ జలాలు పెరిగిన తర్వాత పొలాలకు నీటి తడులు అందించి మాగాణి సాగుగా మార్చుకోవచ్చని పేర్కొన్నారు. ఏరోబిక్ సాగు వలన కలిగే లాభాలు ఆయన మాటల్లోనే..

- విత్తనాలను నేరుగా పొడి దుక్కుల్లో విత్తుకోచ్చు.
- పొలాన్ని దమ్ము చేయడం, నారుమడి పోసుకోవడం, నారుతీత, నాట్లు వేయడం ఏవీ అవసరం లేదు. దీని ఫలితంగా సాగు ఖర్చు, సమయం ఆదా అవుతుంది.
- నేలను దమ్ము చేసే పని ఉండదు.
- నేల భౌతిక స్థితి మెరుగ్గా ఉంటుంది.
- పదే పదే దమ్ము చేయడం వలన సాగు నేలల్లో బలం తగ్గిపోయి ఆపరాల దిగుబడి తగ్గిపోతుంది. అయితే ఏరోబిక్ పద్ధతిలో సాగుతో నేల బలం తగ్గిపోదు.
- భూగర్భ జలాలపై ఒత్తిడి పెరగదు.
- తక్కువ మంది కూలీలతో విత్తుకోవచ్చు.
- తక్కువ ఖర్చుతో సీడ్ డ్రిల్ ద్వారా కూడా విత్తుకోవచ్చు.
- తొలకరి జల్లులు పడిన వెంటనే విత్తుకోవాలి.
- నారు పోయడం, నాట్లు వేసేందుకు కూడా ఖర్చు ఉండదు.
- 10 రోజుల ముందే పంట కోతకు వస్తుంది.

కలుపే ప్రధాన సమస్య

కలుపు ప్రధాన సమస్య కాబట్టి ఎక్కువగా రసాయనాలు వాడాల్సి ఉంటుంది. విత్తిన రెండు రోజుల్లోపు ఎకరానికి పెండిమిథాలిన్ 1-1.5 లీటర్లు పిచికారీ చేయాలి. 15 నుంచి 20 రోజులకు పొలంలో గడ్డిజాతి కలుపు అధికంగా ఉంటే సహైలోఫాప్ బ్యూటైల్ 400 మి.లీ. లేదా అన్ని రకాల కలుపు ఉంటే బిస్ పైరిబాక్ సోడియం 80 నుంచి 100 మిల్లీలీటర్లు పిచికారీ చేయాలి.

- 25 నుంచి 40 శాతం సాగు నీరు ఆదా అవుతుంది.

సీడ్ డ్రిల్‌తో విత్తే విధానమే మేలు..

ట్రాక్టర్‌కు అమర్చిన సీడ్ డ్రిల్‌తో విత్తడం వల్ల కొంచెం లోతుగా విత్తనం భూమిలోకి చొచ్చుకెళ్లడంతో వేరు వ్యవస్థ విస్తరిస్తుంది. దీని వల్ల వర్షాలు, ఈదురు గాలులకు పైరు పడిపోకుండా బలంగా నిలబడుతుంది. ఈ పద్ధతిని అనుసరిస్తే తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలను ఆర్జించవచ్చు.

పంట దిగుబడి

సాధారణ వరి సాగు పద్ధతి కన్నా ఈ విధానంలో 5 నుంచి 10 బస్తాల దిగుబడి అదనంగా వస్తుంది. పంట కూడా నాణ్యంగా వస్తుంది.